నిర్వహణ లోపం.. రహదారికి శాపం

- గత ప్రభుత్వంలోరూ.3.2 కోట్లతో అభివృద్ధి
- నిర్వహణ నిధులు కేటాయించని కూటమి సర్కార్
- ప్రమాదకరంగా అప్రోచ్ సీసీ రహదారులు
- కుంగిపోతున్న రోడ్డు మార్జిన్లు


మడుగులా ఉన్న బావాయిపాలెం సాయిబాబా గుడి వద్ద అప్రోచ్ రోడ్డు


చినరామచంద్రపురం ప్రారంభంలో కుంగిపోతున్న రోడ్డు మార్జిన్

నిడమర్రు: బువ్వనపల్లి–గణపవరం కూడలి నుంచి కాపవరం సరిహద్దు వరకూ ఉన్న ఆర్అండ్బీ రహదారి రోజు రోజుకూ ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్ద కాలంగా అధ్వానంగా ఉన్న రహదారిని నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వం మారింది కానీ ఈ రహదారి వెంబడి కనీస నిర్వహణ మరమ్మతులు నిర్వహించకపోవడంతో ఈ రహదారి వెంబడి మార్జిన్లు కుంగిపోయి రోజు రోజుకూ ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడం ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా రోడ్డు మార్జిన్లు కుంగిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎదురెదురుగా వస్తున్న లారీలు, భారీ వాహనాలు తప్పించుకోవడంలో ప్రాణాల మీదకు తెచుకుంటున్నారు. వాసుబాబు ఐస్ ఫ్యాక్టరీ, చినరామచంద్రపురం మలుపు, వెంకటేశ్వర స్వామి ఆలయం మలుపు, ఇందిరమ్మ కాలనీ, సిద్ధాపురం మలుపు, బావాయిపాలెం సాయిబాబా ఆలయం వద్ద ప్రాంతాల్లో రోడ్డు మరీ దారుణంగా ఉన్నట్లు వాహనదారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోజు రోజుకూ అధ్వానంగా మారుతున్నట్లు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వాహనాలతో నిత్యం రద్దీ

ఈ రహదారి ఆకివీడు వెళ్లేందుకు దగ్గర దారి కావడం, ఆక్వా చెరువులు ఎక్కువగా విస్తరించి ఉండటంతో మేతల లారీలు, ఆక్వా పట్టుబడి లారీలు, ఐస్ లారీలు వంటి భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఈ రహదారి ఉంటుంది. దీంతో ఈ రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా ఉంది. ఈ రహదారి వెంబడే కళాశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థలు ఉండటంతో పాటు భీమవరం, తాడేపల్లిగుడెం నుంచి వచ్చే స్కూల్ బస్సులు, కళాశాలల బస్సులతో ఉదయం, సాయంత్రం వేళల్లో మరింత రద్దీగా ఉండడంతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుందని వాహనదారులు చెబుతున్నారు. అసలే ట్రాఫిక్ సమస్య దీనికి తోడు రోడ్డు గుంతలతో ఉండటంతో ప్రయాణికులు ఈ మార్గంలో వెళ్లాలంటే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బావాయిపాలెం రోడ్డులో గోతుల్లో నిలిచిపోయిన వర్షపు నీరు

వైఎస్సార్సీపీ హయాంలో రూ.3.2 కోట్లతో రోడ్డు నిర్మాణం

వైఎస్సార్సీపీ హయాంలో 2023లో గణపవరం–బువ్వనపల్లి కూడలి నుంచి కాపవరం సరిహద్దు వరకూ ఈ ఆర్అండ్బీ రహదారిని రూ.3.2 కోట్ల నిధులతో నిర్మించారు. ప్రభుత్వం మారిన తరువాత ఈ రహదారి నిర్వహణపై పాలకులు ఎటువంటి శ్రద్ధ పెట్టకపోవడంతో ఈ రోడ్డు రోజు రోజుకూ మరమ్మతులకు గురవుతోందని స్థానికులు వాపోతున్నారు. సిద్ధాపురం మలుపులో ఇరువైపులా కుంగిపోయి కల్వర్ట్ తూరలు పగిలిపోయి ప్రమాదకరంగా ఉంటే ఇటీవలే స్థానికులే గ్రావెల్తో పూడ్చుకున్నట్టు బావాయిపాలెం గ్రామ పెద్దలు ముత్యాల స్వామి తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి పెద్ద ప్రమాదాలు జరగకుండా తక్షణం రహదారి మరమ్మతులు చేపట్టి, రోడ్డు మార్జిన్లోని గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

రోడ్డు మార్జిన్ల మరమ్మతులు చేపట్టాలి



గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఆర్అండ్బీ రహదారులు నిర్మిస్తే నేటి ప్రభుత్వం కనీసం ఆ రోడ్డుకు మార్జిన్లు కూడా వేయలేని పరిస్థితిలో ఉంది. నిర్వహణ నిధులు విడుదల చేసి బావాయిపాలెం రోడ్డు మార్జిన్ల మరమ్మతులు చేపట్టాలి. వర్షాకాలంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

–కోడె కాశీ, జెడ్పీటీసీ, నిడమర్రు

ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత



రోడ్డు నిర్వహణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటే అక్కడ జరిగే ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏటా వేసవిలో రోడ్ల నిర్వహణ చేపట్టకపోతే వర్షాకాలంలో మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి.

–నారపల్లి రమణారావు, సీపీఐ నాయకులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గణపవరం: మండలంలోని కాశిపాడు విద్యుత్ సబ్స్టేషన్కు వచ్చే దువ్వ విద్యుత్ సబ్స్టేషన్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 4వ తేదీన ఫీడర్ పరిధిలోని కాశిపాడు, చింతపల్లి, చిలకంపాడు, డి.కుముదవల్లి, కోమర్రు, జల్లికాకినాడ, అప్పనపేట, కేశవరం, ఎ.గోపవరం, కామట్లపాలెం, తాళ్లపాలెం, వెంకట్రాజపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ నరసింహమూర్తి తెలిపారు.

దెందులూరులో..

దెందులూరు: మండలంలో విద్యుత్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 4న గుడిగుంట సబ్స్టేషన్ పరిధిలో గంగన్నగూడెం, జోగన్నపాలెం, గుడిగుంట, ఆక్కిరెడ్డిగూడెం, బొబ్బిలవారిగూడెం, సీతాపురం, వెంగంపాలెం, బొడ్డువారిగూడెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు కోరారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి దంత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయకుమార్ అన్నారు. గురువారం దెందులూరు హైస్కూల్లో సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ హాస్పిటల్ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

క్లుప్తంగా

కార్యకర్తలకు వైఎస్సార్సీపీ అండ


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వైఎస్సార్సీపీ నేతలు

ఉంగుటూరు: వైఎస్సార్సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మండల నేతలు పేర్కొన్నారు. కంసాలిగుంట గ్రామంలో శాకమూడి దీపాలమ్మ చనిపోవడంతో ఆమె కుమారుడు నాగరాజును పరామర్శించారు. అక్కుపల్లి గోకవరం గ్రామంలో గంజి మాణిక్యమ్మ చనిపోవడంతో వారి మనవుడు పెండెం విద్యాసాగర్ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ప్రమాదంలో గాయపడిన బూసి కొండయ్య, వాసె నానిలను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు మరడమంగరావు, యెలిశెట్టి పాపారావు బాబ్జి, పుప్పాల గోపి, మిద్దే సత్యవతి, వెంకటేశ్వరరావు, దేవదాసి విజయనిర్మల ధర్మరాజు, మానుకొండ వెంకటేశ్వరరావు, ముమ్మడి సర్నేలు రాజు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


ఐస్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నేతలు

నిడమర్రు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను విజయవతం చేయాలని సీఐటీయూ నాయకులు నారపల్లి రమణరావు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నిడమర్రు, బువ్వనపల్లి, అడవికొలను గ్రామాల్లో కార్మిక నేతలు పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. పలు పరిశ్రమల యాజమాన్యాలకు, బ్యాంకులకు, ప్రైవేట్ కార్యాలయాల యజమానులకు, లారీ ఆఫీసులకు సమ్మె నోటీసులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కమిలి నాని, కానూరు రాజు, సంకు నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

6న కనకదుర్గమ్మకు సారె

దెందులూరు: రామదండు ఆధ్వర్యంలో ఈ నెల 6న కనకదుర్గమ్మకు ఆషాడ మాస సారె సమర్పిస్తారని రామదండు దెందలూరు మండల నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. ఉదయం దెందులూరు విష్ణు ఆలయం నుంచి ఉదయం 7.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మహిళలు 108 రకాల కావిళ్లతో అమ్మవారికి తొలి ఏకాదశి పురస్కరించుకొని గ్రామ శివారులో ఉన్న కనకదుర్గమ్మకు ఆషాడమాస సారె సమర్పిస్తారన్నారు. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని రామదండు కమిటీ కోరింది.

రహదారులపై గుంతల పూడికకు ఆదేశాలు


ఛిద్రమైన రహదారిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉంగుటూరు: రహదారులపై గుంతలు పూడ్చమని ఇంజనీరింగు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని ఎంపీడీవో రాజ్మనోజు తెలిపారు. గురువారం మండలంలోని ట్రాఫిక్ మళ్లింపు, వర్షాల వలన దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. కైకరం, తల్లాపురం, రావులపర్రు, దొంతవరం, నారాయణపురం, ఉంగుటూరు, గొల్లగూడెం గ్రామాల్లో రహదారులను, పారిశుద్ధ్య పనులను, కైకరంలోని డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. ఈ మేరకు రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాత్కాలిక చర్యల్లో ముందుగా గుంతలను పూడుస్తామని ఎంపీడీవో తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఉంగుటూరు: పోలవరం కాలువకు నీరు విడుదల చేసినందున పోలవరం పరీవాహక గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ కోరారు. పశువులను కాలువలోకి దిగకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలు కూడా కాలువలోకి దిగొద్దని తెలిపారు. దమ్ము ట్రాక్టర్లు రహదారులపై చక్రాలకు పట్టాలు వేసుకొని వెళ్లాలని తహసీల్దార్ సూచించారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

ఉంగుటూరు: నారాయణపురం వివేకానంద హైస్కూలులో సుదీర్ఘకాలం ఉపాధ్యాయులుగా పని చేసిన పలువురు బదిలీ అయ్యారు. వారికి గురువారం వీడ్కోలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ సురేంద్ర, రాణి శైలజ, జి.రామారావు, బాలకృష్ణ, పద్మ, అయినాల శ్రీనివాసరావు, బి.రాణి, సామంతుల లక్ష్మణకుమార్, హెచ్ఎం తోట పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన తప్పనిసరి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఏలూరు సబ్ యూనిట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. పూళ్ల పీహెచ్సీ వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి ఆధ్వర్యంలో గురువారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని పీహెచ్సీ పరిధిలోని కురెళ్లగూడెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి వైద్య ఆరోగ్య బృందం దోమ కాటు వలన కలిగే అనర్థాలపై వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె.గోవిందరావు మాట్లాడుతూ దోమలు వలన ప్రాణాంతక వ్యాధులు సోకుతాయన్నారు. ప్రతి శుక్రవారం పొడి వాతావరణం కలిగి ఉండాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ కీటకజనిత ప్రదేశాలను నిలువరిస్తే వ్యాధుల బారి నుంచి రక్షణ పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఆధునికీకరణ పనులు


నత్తనడకన సాగుతున్న ఎంపీడీవో కార్యాలయ ఆధునికీకరణ పనులు

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంపీడీవో ఆఫీసు ముందు అభివృద్ధి, ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలల పైబడి ప్రతిపాదించిన పనులు ఇంకా సాగుతానే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పాలక వర్గం సభ్యులు తీర్మానించిన పనులే ఆలస్యమయితే గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు తీర్మానించిన పనులు ఇంకెంత ఆలస్యమవుతాయో అర్థం చేసుకోవచ్చు. ఎంపీడీవో ఆఫీసు ముందు స్టేజి నిర్మాణం ,గ్రీన్ గార్డెన్గా మార్చడం, వాహనాలు పెట్టుకునే షెడ్డు కమ్ డైనింగ్ హాలు నిర్మాణం , తదితర అభివృద్ధి పనుల కోసం 9 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. సదుపాయాల మెరుగునకు నిర్వహించుకునేందుకు అనువుగా తీర్మానాలు చేశారు. చాలా కాలం పనులు మెదులు పెట్టలేదు. పీఆర్ఏఈకి సమయం లేకపోవడం, కాంట్రాక్టర్ పనులు త్వరితగతిన మొదలు పెట్టకపోవడంతో ఆలస్యమైంది. పనుల ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అయితే ఎట్టకేలకు పనులు మెదులు పెట్టారు. అయితే ప్రకృతి సహకరించడం లేదు. దీంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పనులు నిలిచిపోయాయి. పనులు ముందుకు సాగటం లేదు. ఎంపీడీవో ఆర్ మనోజును వివరణ కోరగా మార్చి నెలలో తీర్మానాలు చేసి అప్పజెప్పామని పనులు మొదలు పెట్టడం వాస్తవమేనని అన్నారు. వర్షాల కారణంగా ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. త్వరలోనే పనులు నిర్వహిస్తామని వివరించారు. ఈ విషయం మీద ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

దాతల వితరణ అభినందనీయం


దివ్యాంగులకు బియ్యం అందజేస్తున్న దాతలు, పెద్దలు

భీమడోలు: మానవసేవే మాధవసేవ అనే సిద్ధాంతంతో దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తున్న దాతల వితరణ అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలను గ్రామంలోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం 66 మంది దివ్యాంగులకు దాతలు ఆర్థిక సాయంతో సన్నబియ్యం, పోషకాహారాన్ని అందించారు. దాత మంతెన సూర్యనారాయణరాజు బియ్యం, పోషకాహారాన్ని, ఆగడాల లంకకు చెందిన దాత షేక్ సయ్యద్ బాజీ, సబియాసరీఫ్ దంపతులు భోజనాన్ని అందించారు. దాతలు రెండు వీల్ చైర్లను ఇద్దరు దివ్యాంగులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పేరిచర్ల కేశవరాజు, దాట్ల విజయరామరాజు, నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు, రావి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ శ్రేణులు తరలి రావాలి

భీమడోలు: దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయం వద్ద ఈ నెల 4వ తేదీ శుక్రవారం ఏలూరు జిల్లా, దెందులూరు నియోజకవర్గాల వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని, భీమడోలు మండల పార్టీ అధ్యక్షుడు రావిపాటి సత్య శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు కోరారు. జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే నినాదంతో చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాల పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, పీఏసీ సభ్యుడు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారన్నారు.

సమావేశానికి కొండలరావుపాలెం రావాలి

ఉంగుటూరు: వైసిపి పార్టీ విస్తృతస్థాయి సమావేశం నేడు ఏలూరు నుంచి దెందులూరు నియోజకవర్గం కొండల రావుపాలెంకు మార్చడం జరిగిందని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు తెలిపారు. పార్టీ కార్యకర్తలు నాయకులు కొండలరావు పాలెం చేరుకోవాలని ఆయన సూచించారు.

వీడని వర్షం.. రోడ్లు ఛిద్రం

- గోతుల్లో నిలిచిన నీరు
- రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు


పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో దెబ్బతిన్న మెయిన్రోడ్డు

చింతలపూడి : అల్ప పీడనం ప్రభావంతో మెట్ట ప్రాంతంలో వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండ వానలు పడుతున్నాయి. రోడ్లపైకి నీరు చేరి అవి ఛిద్రంగా తయారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గోతుల్లో డస్ట్ పోసి మరమ్మతులు చేశారు. పోసిన ఆరు నెలలకే మళ్లీ గోతులు పడటంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి, గురుభట్ల గూడెం రోడ్డు, చింతలపూడి మెయిన్ రోడ్డు, చింతలపూడి సీతానగరం రోడ్డు, ఏలూరు చింతలపూడి ప్రధాన రహదారితో పాటు రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు నుంచి కామవరపుకోట, ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారులు పలు ప్రాంతాల్లో గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. సరైన డ్రైయినేజీ సదుపాయం లేకపోవడం, కొద్దిపాటి వర్షాలకు కూడా రోడ్లు బురదమయంగా మారి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం నీరు బయటికి పోయే అవకాశం లేక రోడ్లపైనే మోకాల్లోతు నీరు నిలిచిపోతుంది. ఏది గొయ్యో, ఏది గొప్పో గుర్తించే లోపే వాహన చోదకులు జారిపడుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులను తక్షణం మరమ్మతులు చేయించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

చిత్తడిగా రహదారులు

ప్రధాన రహదారులే కాక వర్షాలకు గ్రామీణ రహదారులు సైతం అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారాయి. చినుకు పడితే కనీసం నడవడానికి కూడా అవకాశం లేకుండా ఉన్నాయి. చింతలపూడి పూరుటీనగర్, ఎన్టీఎన్ కాలనీ, ఆంథోని నగర్, గణేష్ కాలనీ, ఛార్లెస్ నగర్ వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. ప్రణాళికలు పూర్తయినా గ్రామీణ రహదారుల అభివృద్ధి జరగడం లేదు. రోడ్ల దుస్థితిపై అధికారులు స్పందించాలని గ్రామీణులు కోరుతున్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యం


మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ

కొయ్యలగూడెం: సంపూర్ణ పారిశుద్ధ్యం అమలుతోనే ప్రజలకు పరిపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని జెడ్పీ సీఈఓ ఎం శ్రీహరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎంపీడీఓ కె.కరుణ్ కుమార్తో కలిసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మొక్కల పెంపకం ప్రతి పౌరుడూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎంపీడీఓ కె.కిరణ్కుమార్ అందజేసిన మొక్కలను గ్రామ కూడళ్లు, సచివాలయాల వద్ద నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బయ్యన్నగూడెం, సీతంపేట పంచాయతీల్లో శానిటేషన్ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి వర్షాకాలంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందని తెలిపారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న చెత్త సేకరణ గురించి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజల నుంచి ఆరా తీశారు.

పోస్టాఫీసుకు కుర్చీల బహూకరణ


కుర్చీలు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: గణపవరం సబ్ పోస్టాఫీసులో వినియోగదారుల ఇబ్బందుల దృష్ట్యా లయన్స్ క్లబ్ తరపున ప్లాస్టిక్ కుర్చీలను బహూకరించారు. పోస్టాఫీసుకు వివిధ పనుల నిమిత్తం వస్తున్న వినియోగదారులు, ఖాతాదారులు కనీసం కూర్చోవడానికి కుర్చీలు, బెంచీలు లేవన్న విషయాన్ని లయన్స్ క్లబ్ దృష్టికి తీసుకురాగా క్లబ్ తరపున గురువారం పది కుర్చీలను బహూకరించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లంకినరేష్, కిలారి రవి, సభ్యులు కె.సత్యనారాయణమూర్తి, కె.విశారద, రావూరి నాగరాజు, రవికుమార్, గఫూర్, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

పత్తేపురం రోడ్డు మరమ్మతులు చేపట్టాలి


రహదారి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

నిడమర్రు: నిడమర్రు–పత్తేపురం రహదారి మరమ్మతులను వెంటనే చేపట్టాలని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆ రోడ్డు వద్దే నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ఈ మార్గంలో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నా పాలకులు కనీస మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ అధికారులకు పిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. దీంతో రోడ్డు గుంతలు, మడుగుల్లా ఉన్న ప్రాంతంలో నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, మోహనరాజు పాల్గొన్నారు.

అభయాంజనేయుని సన్నిధిలో..

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని గురువారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ సందర్శించారు. ఆలయంలో పూజలు చేయించారు. గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, వాసవీదేవి ఉన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

జంగారెడ్డిగూడెం: స్థానిక సర్కిల్ పరిధిలోని కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామ శివారులో ఉన్న పెద్దవాగు ఒడ్డున సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 250 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కేబుల్ ప్రసారాలపై న్యాయపోరాటానికి సిద్ధం

దెందులూరు: కేబుల్ ప్రసారాల్లో వివక్షత కేబుల్ ఆపరేటర్ల కుమ్మక్కుపై న్యాయపోరాటానికి సిద్ధమని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం తెలిపారు. గురువారం జోగన్నపాలెంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సాక్షి ఛానల్కు కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా కోట్లాది మంది అభిమానులు ఉన్నారన్న సంగతిని యావత్తు రాష్ట్రంలో కేబుల్ ఆపరేటర్లు ప్రత్యేకంగా గమనించాలని కోరారు. నిబంధనల ప్రకారం కేబుల్ ఆపరేటర్లు తమ విధి నిర్వహణ చేయాలే తప్ప ఎవరి సంతోషం కోసమో ఒత్తిళ్లకు తలొగ్గి సాక్షి ఛానల్ ప్రసారాన్ని నిలుపుదల చేసే హక్కు కేబుల్ ఆపరేటర్లకు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. వెంటనే సాక్షి చానల్ ప్రసారాలను పునరుద్ధరించాలని, లేకుంటే న్యాయ పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్లో రికార్డుల తనిఖీ

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరం పోలీస్స్టేషను డీఎస్పీ యు.రవిచంద్ర గురువారం సందర్శించారు. పెండింగ్లో ఉన్న కేసుల ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్స్టేషన్కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో గస్తీ పెంచాలని, డయల్ 112 ఫిర్యాదుపై వేగంగా స్పందించాలని అన్నారు. స్టేషన్లో పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై శశాంక పాల్గొన్నారు.